క్లుప్తంగా

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి

తాండూరు టౌన్: వీధి కుక్కల దాడి నుంచి ప్రజలను రక్షించడంలో భాగంగా వాటి నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో కుక్కలను పట్టుకునే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వీధి కుక్కలు పలువురు చిన్నారులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడుతుండటంతో వాటిని నియంత్రించడం కోసం స్టెరిలైజేషన్ ప్రక్రియను ప్రారంభించామన్నారు. ప్రత్యేక బృందాలతో మగ కుక్కలను పట్టుకుని వాటిని డంపింగ్ యార్డుకు తరలించి వైద్యుల సహకారంతో వాటి వల్ల సంతానం కలుగకుండా స్టెరిలైజేషన్ చేయిస్తున్నామన్నారు. కుక్కలకు హాని తలపెట్టడం చట్టరీత్యా నేరం కావడంతో వాటి సంఖ్యను నెమ్మదిగా తగ్గించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

ప్రారంభమైన రోడ్డు పనులు

సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



యాలాల: బాగాయిపల్లి-కమాల్‌పూర్‌లో నిర్వహిస్తున్న రోడ్డు పనులు

యాలాల: బాగాయిపల్లి నుంచి కమాల్‌పూర్ వరకు సింగల్ రోడ్డు వెడల్పు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. పదేళ్లుగా ఈ మార్గంలో సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారి వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రోడ్డు వెడల్పు విషయమై గతంలో అనేక మార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ విషయంలో స్పందించిన అధికారులు ఎట్టకేలకు రోడ్డుపనులు ప్రారంభించారు. ఈ పనులు ప్రారంభించడంతో వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు మార్గమధ్యలో కల్వర్టు పనుల అనంతరం బీటీ పనులు ప్రారంభమవుతాయని ఆర్అండ్‌బీ సిబ్బంది శ్రావణ్ తెలిపారు. కాగా రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం కావడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, యువజన నాయకుడు సత్యనారాయణ రెడ్డి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌ఐ ఆత్మహత్యకు బాధ్యత వహించాలి

తాండూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట్ ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బాధ్యత వహించాలని కుల అసమానత నిర్మూలన పోరాట సమితి జిల్లా కన్వీనర్ హెచ్ వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐ జితేందర్ రెడ్డితో పాటు పలువురు కానిస్టేబుళ్లు సివిల్ కేసుల్లో అమాయకులకు వ్యతిరేకంగా కేసులు బనాయించాలని ఒత్తిడికి గురిచేయడంతో పాటు, కులం పేరుతో అవమానించడం, ఒకే నెలలో 23 మెమోలు జారీ అయ్యాయని మనోవేదనతోనే శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసనలో సమితి సభ్యులు నర్సిములు, కిష్టప్ప, మధు, రత్నం, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



సీడీపీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరిగి: సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. గురువారం సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడారు. మినీ అంగన్‌వాడీల నుంచి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అయినా పూర్తి వేతనాలు చెల్లించడం లేదన్నారు. మెయిన్ అంగన్‌వాడీ టీచర్ల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా మహాసభలు

అనంతగిరి: అఖిల కర్ణాటక భారత శాంతి సంఘీభావ సంగం వికారాబాద్ జిల్లా ప్రథమ మహాసభ శనివారం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి పండిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం పట్టణంలోని సత్యభారతి గార్డెన్లో 11 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

చెరువు నిండినా సాగునీరు కరువు

కాల్వల మరమ్మతుల్లేక ఆయకట్టుకు అందని వైనం

- అవస్థలు పడుతున్న రైతులు
- బీళ్లుగా మారుతున్న భూములు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: ప్రభుత్వాలు మారుతున్నా ఆరుగాలం కష్టించి పనిచేసే రైతులకు మాత్రం కష్టాలు తప్పడంలేదు. ఈ ఏడాది భారీ వర్షాలు కురువడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. మండలంలో యాసంగికి సాగునీరుకు ఢోకాలేదనుకున్నా నిరాశే మిగిలింది. చెరువు కింద దెబ్బతిన్న కాల్వలు, అలుగులకు మరమ్మతులు చేపట్టడంలేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కాల్వలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. మిషన్ కాకతీయ పథకం కింద చెరువులకు మరమ్మతులు చేపట్టినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు.

మండలంలో...

మండలంలో 33 పంచాయతీలు ఉండగా వాటి పరిధిలో సుమారు 9 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. మండలంలోని దౌల్తాబాద్, బాలంపేట, గోకఫసల్‌వాద్, ఈర్లపల్లి గ్రామాల్లో ఉన్నాయి. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో అవి నిండు కుండలా మారాయి. చెరువుల కింద కాల్వలు పాడవడంతో భూములకు సాగు నీరు అందడంలేదు. పలు చోట్ల అలుగులు సైతం దెబ్బతిన్నాయి. దీంతో వర్షాకాలంలో పంటలు నీట మునిగి నష్టపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు.



నిండుకుండలా పెద్ద చెరువు

పర్యవేక్షణ కరువు

మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులను ఎప్పటికప్పుడు సందర్శించి మరమ్మతులు చేపట్టాలి. కానీ మండలంలో అలాంటి పరిస్థితులు లేవు. ప్రతి చెరువు కింద 200 నుంచి 300 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది.



మరమ్మతులకు నోచుకోని అలుగు

నీరు అందడంలేదు



గ్రామంలో పెద్ద చెరువు కింద భూములు ఉన్నాయి. తూములు, కాల్వలకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వదలడంలేదు. అధికారులు స్పందించి ప్రధాన కాల్వలకు మరమ్మతులు చేయించి ఆయకట్టుకు నీరు అందించాలి.

– నర్సిములు, రైతు, దౌల్తాబాద్

అభివృద్ధిలో భాగస్వామ్యం తప్పనిసరి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య



సభ్యత్వం చేయిస్తున్న బీజేపీ నాయకులు

పరిగి: దేశాభివృద్ధిలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం తప్పనిసరని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో బీజేపీ సభ్యత్వ సమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుతున్నారన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రజల మద్దతు మరింత అవసరమన్నారు. దీనికోసం ప్రజలు ఎక్కువ సంఖ్యలో పార్టీలో చేరి తమ మద్దతు తెలపాలన్నారు. బీజేపీ ఎప్పుడు ఉచిత పథకాలను ఇవ్వదని దేశ సంక్షేమం పురోగతిపైనే దృష్టి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెంటయ్య, పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజనేయులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎం సహాయనిధి



చెక్కు అందిస్తున్న భీంరెడ్డి తదితరులు

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. కుల్కచర్ల మండలం లాల్‌సింగ్ తండాకు చెందిన గోపాల్ నాయక్ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్సపొందారు. పేద కుటుంబానికి చెందిన ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తుచేసుకున్నారు. మంజూరైన రూ.1,50,000ల చెక్కును గురువారం స్థానిక నాయకులతో కలిసి భీంరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ఆపదలో ఉన్న వారికి ఎలాంటి పైరవీలు లేకుండా సహాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, మండల అధ్యక్షుడు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాంచందర్, కుల్కచర్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, మాజీ ఎంపీపీ అంజిలయ్య, కృష్ణయ్య, రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వీధి నాటకాలను ప్రోత్సహించండి

కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ



ఆర్థిక సహాయం అందజేస్తున్న రాజేశ్వరమ్మ

దోమ: ప్రాచీన కాలం నాటి వీధి నాటకాలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం దిర్సంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర మహాత్యం వీధి నాటకాన్ని ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా కళాకారులు వివిధ వేషధారణలతో ఆడుతూ, పాడుతూ అలరింపజేశారన్నారు. అనంతరం ఆమె కళాకారులకు తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లింగయ్య, లక్ష్మి, నారాయణ, నవాజ్, బాల్‌రెడ్డి, నాటకోపాధ్యాయులు రాములు, నర్సింహులు, బాల్‌రాజ్, హనుమాన్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

'12శాతానికే' మద్దతు ధర

పత్తి మిల్లులను సందర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్



శుభం జిన్నింగ్ మిల్లులో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు

యాలాల: పత్తిలో 12శాతం తేమ ఉంటే మద్దతు ధర లభిస్తుందని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దౌలాపూర్, అగ్గనూరు సమీపంలోని పత్తి మిల్లులను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాండూరు మార్కెట్ కమిటీ పరిధిలోని మిల్లుల్లో గతంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారన్నారు. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందన్నారు. మిల్లులో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ సిస్టంను వారు పరిశీలించారు. ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు పత్తిలో 12 శాతం లోపు తేమ ఉండాలని తెలిపారు. దౌలాపూర్ శివారులోని శుభం, బాలాజీ, అగ్గనూరులోని మారుతి పత్తి మిల్లుల్లో చేపట్టిన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ప్రక్రియను పరిశీలించారు. త్వరలో ఆయా మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు రాజు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

పరిగి: పరిసరాల పరిశుభ్రత లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని పలు కాలనీలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రోడ్లపై ఎక్కడ చెత్త లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తాను ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



తాండూరు టౌన్: వాల్మీకి ఆలయంలో పూజలో చైర్‌పర్సన్ స్వప్న తదితరులు

తాండూరు టౌన్: వాల్మీకి జయంతి వేడుకలు గురువారం తాండూరు పట్టణంలోని వాల్మీకి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నా పరిమళ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రామకృష్ణ, సోమశేఖర్, ప్రభాకర్ గౌడ్, భరత్ రెడ్డి, నాగారం మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి సోదరుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోయ అశోక్, లాలప్ప, తిరుపతి, సుధాకర్, నర్సిములు, కృష్ణ, రవీందర్, అనిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానం.. గిరిప్రదక్షిణ

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో గురువారం గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం శోభాయమానంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరై పాంబండ క్షేత్రం చుట్టూ నడిచారు. ప్రతి పౌర్ణమికి గిరిప్రదక్షిణ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.



గిరిప్రదక్షిణలో భక్తులు

మహాసభలను విజయవంతం చేయండి

- కరపత్రం విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు



దుద్యాల్: మహాసభల కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న లింగం సాయిలు

దుద్యాల్: ఈ నెల 19, 20వ తేదీన తాండూర్‌లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేద, కార్మిక, రైతులపై తీవ్ర భారం వేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రైతులు పండిస్తున్న ప్రతి పంటకు గిట్టుబాటు ధరను కల్పించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, సాయిలు, విజయ్ కుమార్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

డీబీఎస్‌యూ మహాసభలు..

కొడంగల్ రూరల్: దళిత బహుజన శ్రామిక యూనియన్ (డీబీఎస్‌యూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తారన్నారు. అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సొడు సంతోష్, ఉపాధ్యక్షుడిగా ఏర్పుల రాములమ్మ, కార్యదర్శిగా అన్నారం అనంతప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటమ్మ, కోశాధికారిగా ఎం.స్వప్న, సలహాదారుడిగా కుర్వ పద్మ, మరో 7గురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

❖ మూలన పడ్డ చెత్త బండ్లు

దుద్యాల్: గ్రామంలోని చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బందికి తోపుడు బండ్లు అందించారు. ఆ తోపుడు బండ్లను ఉపయోగించుకోకుండా ఓ మూలకు పడేశారు. గ్రామంలో వాటిని వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. బోయిన గడ్డ తండాలో, గౌరారం గ్రామాల్లో తోపుడు బండ్లను ఓ మూలకు పడేశారు. ఏదో ఒక రూపంలో వాటిని వినియోగంలోకి తేవాలని మండల వాసులు అధికారులను కోరుతున్నారు.

❖ తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

దౌల్తాబాద్: తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానివొద్దని ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ అంజనేయులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్‌భగీరథ శాఖ ఆధ్వర్యంలో మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఈ శశాంక్‌మిశ్రా, ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.

❖ విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

బంట్వారం: మండలంలోని ఆయా పాఠశాలలకు సంబంధించి 5 మంది ఎస్జీటీ, నలుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు గురువారం విధుల్లో చేరారని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

❖ భవిష్యత్ మనదే.. ధైర్యంగా ఉండండి

నవాబుపేట: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్ఎస్ యువజన మండల నాయకుడు శాంత కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో యువతకు పెద్దపీట వేస్తున్నామని, భవిష్యత్ మనదే అని పార్టీ కోసం యువత పనిచేయాలని కేటీఆర్ యువతను ఉద్దేశించి మాట్లాడినట్లు శాంత కుమార్ తెలిపారు.

❖ ఆర్థిక సహాయం

కుల్కచర్ల: చాపలగూడెం గ్రామపంచాయతీకి చెందిన గండి చిన్న భీమయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మత్స్యసహకార సంఘం నాయకులు బాధిత కుటుంబానికి రూ. 5వేలు అందజేశారు. చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మొగులయ్య, సిద్ధయ్య, సాయన్న, రాములు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

❖ పరీక్షలను పరిశీలించిన ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రెనింగ్ సెంటర్లో కొనసాగుతున్న టర్మ్ 2 పరీక్షలను ఎస్పీ నారాయణరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీటీసీ ప్రిన్సిపాల్, ఏఎస్పీ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

❖ పరిశుభ్రత పాటించాలి

కొడంగల్ రూరల్: పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు కాలనీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

❖ వైభవంగా చండీహోమం

కుల్కచర్ల: పుట్టపహాడ్ గ్రామంలో పౌర్ణమిని పురస్కరించుకుని చండీహోమం వైభవంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మాజీ రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, కార్యక్రమ నిర్వాహకులు కాంగారి అంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

❖ కిరణ్ మృతి బాధాకరం

తాండూరు రూరల్: ఉపాధిహామీ కార్యాలయంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్ మృతి బాధాకరమని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కిరణ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

❖ సమస్యలు పరిష్కరించాలని వినతి

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్‌కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీసీఐ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప మాట్లాడారు. సీసీఐ ఫ్యాక్టరీల్లో పదవీ విరమణ పొందిన 60 మంది కాంట్రాక్టు కార్మికులకు నేటికి పెన్షన్ ఇవ్వలేదన్నారు. గ్రాడ్యూవిటీ, గ్రేడ్ ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐలకు సంబంధించిన అంశాలపై కమిషనర్‌దృష్టికి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, అనుమియా, ఉసేనప్ప, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

❖ అడ్వాన్సు ట్రెనింగ్ సెంటర్‌కు భూమి పూజ

అనంతగిరి: వికారాబాద్ జిల్లాలో అడ్వాన్సు ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటునకు రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం భూమి పూజ నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో అర ఎకరా భూమిలో సుమారు రూ.5కోట్ల అంచనాతో అడ్వాన్సు ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భవన నిర్మాణ ప్లాన్‌ను మంత్రి పరిశీలించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ నాయక్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఐటిఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, టిజిఐఐసి సిబంది పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల నాయకులు

రాజేశ్‌రెడ్డికి అభినందనలు

బొంరాస్‌పేట: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా శేరి రాజేశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు నాయుడు, యూత్‌కాంగ్రెస్ నాయకుడు మల్లేశ్, రాంచంద్రారెడ్డి తదితరులు సన్మానించి అభినందనలు తెలిపారు.

రోడ్డు మధ్యలో గుంత!

- ప్రమాదాలబారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్ నుంచి కోస్గి వెళ్లే రోడ్డులో ఈర్లపల్లి గ్రామం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. ఊరగుంట తండాకు వెళ్లే ఓ మలుపు వద్ద మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ఆ దారిలో మలుపు ఉండడంతో వాహనదారులు గమనించకుండా ప్రయాణం చేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ ద్విచక్రవాహనదారుడు పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ రోడ్డుపై ప్రతి రోజు వేలాది వాహనాలు నడుస్తుంటాయి. కావున ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంత